



క్రీడాకారులతో టీజీఐబిసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి

పరమపవిత్రం.. ధనుర్మాసం



ధనుర్మాసోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మహావిష్ణుకు ఈ మాసం ప్రీతికరమైనది. సూర్యుడు ధనుస్సు నుంచి మకర రాశిలోకి ప్రవేశించే భోగి పండుగ వరకు కొనసాగుతుంది. మెదక్‌లోని కోదండరామాలయం, వెంకటేశ్వరాలయంలో నెలరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. కోదండ రామాలయంలో సోమవారం స్వామివారి పల్లకీసేవను నిర్వహించారు.


-మెదక్ అర్బన్ (ఆంధ్రజ్యోతి)

సీఎం కప్ క్రీడలు ప్రారంభం



క్రీడాజ్యోతి వెలిగించి సీఎం కప్ క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడలను టీజీఐబిసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డితో కలిసి కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రారంభించారు. కలెక్టర్ క్రీడా జ్యోతి వెలిగించి, అన్ని మండలాల నుంచి విచ్చేసిన క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుని, టాస్ వేసి పోటీని వారు ప్రారంభించారు. ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, డీవైఎస్‌వో ఖాసీంబేగ్, జిల్లా లైజనింగ్ అధికారి, టీఎస్‌జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్‌అలీ పాల్గొన్నారు.



పర్యాటకం.. హామీకే పరిమితం

వాగ్దానాల్లోనే రూ.కోట్లు..

నిధుల కేటాయింపులో ఏడుపాయలకు మొండి చెయ్యి

భక్తులకు తప్పని పాట్లు

7

సర్వే.. సాఫీగా..

ఇందిరమ్మ ఇళ్ల కోసం మెదక్ జిల్లాలో 1.91 లక్షల దరఖాస్తులు

ఇప్పటివరకు 20,122 దరఖాస్తుల పరిశీలన

10.55 శాతం పూర్తి



హవేళీఘనపూర్‌లో ఇందిరమ్మ ఇంటి దరఖాస్తుదారుడితో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య (ఫైల్)

మెదక్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే జిల్లాలో ముమ్మరంగా సాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం మెదక్ జిల్లాలో 1,91,100 దరఖాస్తులు వచ్చాయి. వీటిపై విచారణ జరిపించి లబ్ధిదారులను ఎంపిక చేయడం కోసం ఈ నెల 8 నుంచి క్షేత్రస్థాయి సర్వే ప్రారంభించారు. పట్టణాలు, గ్రామాలవారీగా వివరాలను పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు అధికారులు సేకరించి ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 20,122 దరఖాస్తులపై విచారణ జరిపి (10.55 శాతం) వివరాలు సేకరించారు. మిగిలిన దరఖాస్తులపైనా విచారణ చేపట్టనున్నారు.

ప్రాధాన్యతా క్రమంలో కేటాయింపు

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వద్ద ఆరు రకాల వివరాలను పత్రాలలో ఏదో ఒకటి ఉండాలని ప్రభుత్వం నిర్దేశించింది. తొలిదశలో దివ్యాంగులు, ఒంటరి మహిళల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఆ తర్వాత మిగిలిన దరఖాస్తుదారుల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. పూరి గుడిసె, పెంకుటిళ్లు, అద్దె గృహాల్లో నివాసముంటున్న దరఖాస్తుదారుల వద్దకు సర్వే సిబ్బంది వెళ్లి ఇంటి ఫొటో, ఇంటి లోపల, పైభాగాలను విడిగా ఫొటోలు తీసి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. సొంత స్థలం ఉంటే ఇంటి స్థలానికి సంబంధించిన డ్యాక్యుమెంట్ ఫొటోనూ నమోదు చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారా.. గతంలో లబ్ధి పొందారా అనే వివరాలను సేకరిస్తున్నారు. దీంతో పాటు యాప్‌లో మరో 30 రకాల ప్రశ్నలకు సమాధానం రాబడుతున్నారు. ఒక్కో ఇంటి సర్వేకు సుమారు అరగంట వరకు పడుతోందని సర్వే సిబ్బంది చెబుతున్నారు.

మండలాలవారీగా ఇలా..

మెదక్ జిల్లాలో నాలుగు మున్సిపాల్టీలు, 22 మండలాలున్నాయి. అత్యధికంగా పాపన్నపేట మండలంలో 12,994 దరఖాస్తులు, అత్యల్పంగా రామాయంపేట మున్సిపాలిటీలో 2,951 దరఖాస్తులు వచ్చాయి. మండలాలవారీగా వెల్దుర్తి 12,390, అల్లాదుర్గం 8,128, చేగుంట 9,986, చిలప్‌చేడ్ 6,040, హవేళీఘనపూర్ 10,584, కౌడిపల్లి 10,247, కొల్చారం 9,736, మనోహరాబాద్ 6,442, మెదక్ 7,696, నర్సాపూర్ 9,931, నార్సింగి 4,281, నిజాంపేట్ 5,749, రామాయంపేట 6,185..

మిగతా 8వ పేజీలో



సంగారెడ్డిలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

ఆలస్యం.. అనుమానం!

- ఆరోగ్యశాఖలో 97 పోస్టుల భర్తీకి ఫిబ్రవరిలో నోటిఫికేషన్
- రెండు నెలల క్రితం బస్తీ దవాఖానా డాక్టర్ల నియామకం
- తాజాగా పల్లె దవాఖానాల్లో వైద్యుల ప్రొవిజనల్ లిస్ట్
- పది నెలలైనా పూర్తికాని కాంట్రాక్టు పోస్టుల భర్తీ
- పోస్టుల భర్తీలో ఆలస్యంపై అనుమానాలు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ ముందుకు సాగడం లేదు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలు, పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వివిధ విభాగాల్లో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)కింద 97 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 27న నోటిఫికేషన్ జారీ చేశారు. అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన అధికారులు మార్చి నెలలోనే నోటిఫికేషన్‌లో పేర్కొన్న అన్ని కేటగిరీ పోస్టులు భర్తీ చేయాల్సిఉన్నా.. చేయలేదు. పార్లమెంటు ఎన్నికల కోడ్, ఇతరత్ర కారణాలతో నియామకాల ప్రక్రియ నిలిపేశారు. అక్టోబరు 23న బస్తీ దవాఖానాల్లో మెడికల్ ఆఫీసర్ పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించి భర్తీ చేశారు. మిగిలిన పోస్టుల సంగతి పట్టించుకోలేదు. తాజాగా పల్లె దవాఖానాల్లో ఎంబీబీఎస్, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ల(ఎంఎల్‌హెచ్‌పీ-బీఏఎంఎస్) పోస్టుల భర్తీకి ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

మిగతా 8వ పేజీలో



నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న కాళేశ్వరం కాలువ సొరంగం


భూములిచ్చి ప్రయోజనమేమి?

- కాళేశ్వరం 18వ ప్యాకేజీ పనుల గతేమిటి?
- భూములు పోయినా నీళ్లొస్తాయని రైతుల ఆశలు
- ఏడాదిగా నిలిచిన కాలువ పనులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న భూనిర్వాసితులు

6

సత్వార్ @ 6.6 డిగ్రీలు

ఈ సీజన్‌లోనే రికార్డుస్థాయిలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు



ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)

సత్వార్ 6.6
కోహీర్ 6.8
న్యాల్‌కల్ 6.7
గుమ్మడిదల 6.8
జహీరాబాద్, అందోల్, సిర్గాపూర్ 6.9
పుల్కల్, దిగ్వాల్ 7.0

జహీరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. సోమవారం సంగారెడ్డి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో 6 నుంచి 10 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం వేళల్లో పొగమంచు దట్టంగా కమ్ముకుంటుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంగారెడ్డి జిల్లా సత్వార్‌లో 6.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. న్యాల్‌కల్ 6.7, కోహీర్ 6.7, గుమ్మడిదల 6.8, జహీరాబాద్, అందోల్, సిర్గాపూర్ 6.9, పుల్కల్, దిగ్వాల్ 7.0, నిజాంపేట్ 7.1, కంగ్టి, అల్గోల్ 7.2 మల్‌చెల్మ 7.3, రామచంద్రాపురం 7.4, కంది‌లో 7.5, కడ్పల్, 7.6, జిన్నారం, చౌటకూర్, హత్నూర, అన్నాసాగర్‌లో 7.8, మొగుడంపల్లిలో 7.9, కంకోల్‌లో 8.0, కల్హేర్‌లో 8.1, ముక్తాపూర్‌లో 8.4, గుండ్ల మాచనూర్, కొండాపూర్‌లో 8.5, ఝరాసంగంలో 8.6, పాశమైలారం 8.7, సంగారెడ్డి 8.9, మనూరు 9.4, రాయికోడ్ 9.5, మునిపల్లి 9.6, సుల్తాన్‌పూర్ 9.7, నారాయణఖేడ్ 9.8, సదాశివపేట 9.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మున్సిపాలిటీలకు పోస్టులు మంజూరు

ఉమ్మడి జిల్లాలో పది బల్దియాల్లో నియామకాలు

తూప్రాన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాలో నూతనంగా ఆరేళ్ల క్రితం కొత్త కార్పోరేషన్‌లు, మున్సిపాలిటీలు ఏర్పాటు చేసినప్పటికీ, కమిషనర్ పోస్టు ఏర్పాటు చేయలేదు. మున్సిపాలిటీలలో ఇంత కాలం మున్సిపల్ సీనియర్ మేనేజర్లు కమీషనర్లుగా కొనసాగారు. రాష్ట్ర వ్యాప్తంగా 86 మున్సిపాలిటీలలో 316 పోస్టులు ఏర్పాటు చేశారు. ఏడుగురు సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌లు, 43 మంది గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, 41 మంది గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్లు, 11 మంది మేనేజర్లు, రెవెన్యూ ఆఫసర్లు (కేటగిరి-3), ఏడుగురు హెల్త్ ఆఫీసర్లు, 10 మంది శానిటరీ సూపర్‌వైజర్లు, 86 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 96 మంది హెల్త్ అసిస్టెంట్లు, 15 మంది జూనియర్ అసిస్టెంట్, హెచ్‌ఓడీ, రీజనల్ ఆఫీసర్ పోస్టులు క్రియేట్ చేశారు. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాలో తెల్లాపూర్, బొల్లారం, అమీన్‌పూర్, నారాయణఖేడ్, ఆందోల్-జోగిపేట (సంగారెడ్డి), తూప్రాన్, రామాయంపేట, నర్సాపూర్ (మెదక్), దుబ్బాక, చేర్యాల (సిద్దిపేట) మున్సిపాలిటీలకు కమిషనర్, ఇతర పోస్టులు మంజూరు చేస్తు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ టీకే శ్రీదేవి ఆదేశాలు జారీ చేశారు. గ్రేడ్-2 పరిధిలో తూప్రాన్, దుబ్బాక, తెల్లాపూర్, బొల్లారం, అమీన్‌పూర్, ఆందోల్-జోగిపేట, గ్రేడ్-3 పరిధిలో రామాయంపేట, నర్సాపూర్, చేర్యాల, నారాయణఖేడ్ మున్సిపాలిటీలను చేర్చారు. ఉమ్మడి జిల్లాలోని 10 మున్సిపాలిటీలకు గ్రేడ్-2, గ్రేడ్-3 కమిషనర్ పోస్టులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హెల్త్ అసిస్టెంట్‌లు 30 మంజూరు చేశారు.



సంగారెడ్డిలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ క్రాంతి



నర్సాపూర్‌లో ఓ కేంద్రం వద్ద భద్రతను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ

ముగిసిన గ్రూప్-2 పరీక్ష

సంగారెడ్డి అర్బన్/మెదక్‌అర్బన్/నర్సాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష రెండో రోజు సోమవారం ప్రశాంతంగా ముగిసింది. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉదయం నిర్వహించిన పేపర్-3 పరీక్షకు 15,218 మంది అభ్యర్థులకు 7,205 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పేపర్-4 పరీక్షకు 7,197 మంది హాజరయ్యారు. సంగారెడ్డిలోని ఎస్పీ జూనియర్ కళాశాల, సాహితీ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

కిటకిటలాడిన బస్టాండ్లు.. బస్సులు

మెదక్ జిల్లాలోని 16 కేంద్రాల్లో ఉదయం పరీక్షకు 5,855 మంది అభ్యర్థులకు గానూ 2,815 మంది హాజరయ్యారు. 48.08 శాతం హాజరు నమోదైంది. మధ్యాహ్నం పరీక్షకు 2,809 మంది హాజరు కాగా 47.98 శాతం హాజరు నమోదైంది. రెండవ రోజు పరీక్ష హాజరు శాతం స్వల్పంగా తగ్గింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అభ్యర్థులతో బస్టాండ్లు కిటకిటలాడాయి. నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్‌ఐటీలో గ్రూపు-2 పరీక్ష ప్రశాంతగా ముగిసింది. తహసీల్దార్ శ్రీనివాస్‌లు, అదనపు ఎస్పీ మహేందర్, రామాయంపేట సీఐ వెంకట్‌రాజ్ కేంద్రాన్ని సందర్శించి అభ్యర్థులను తనిఖీ చేశారు.

అటకెక్కిన అర్బన్‌పార్కు

- కాజీపల్లి అటవీ అభివృద్ధి శూన్యం
- సినీ హీరో ప్రభాస్ రూ.2 కోట్ల విరాళం
- అయినా ముందుకు సాగని పనులు

7



మొక్కను నాటుతున్న ప్రభాస్(ఫైల్)

ఆర్టీసీకి ఆదాయంపై నజర్

32 ఏళ్ల లీజుకు ఆర్టీసీ స్థలం.. 6 ఎకరాల్లో రెండు ఫంక్షన్‌హాళ్లు



సంగారెడ్డి డిపోలో చదును చేసిన స్థలం

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అదనపు ఆదాయంపై ఆర్టీసీ దృష్టిసారించింది. సంస్థకు చెందిన భూములను అద్దె ప్రాతిపదికన ప్రైవేట్ సంస్థలకు కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ఆర్టీసీ డిపో ఆధీనంలో స్థలాన్ని 32 ఏళ్ల లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. సంగారెడ్డిలోని కొత్త బస్టాండు, ఆర్టీసీ డిపో, గ్యారేజి ఏర్పాటు కోసం 1975 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 237 సర్వే నంబరులో 14.18 ఎకరాల భూమిని కేటాయించింది. ఇందులో 4 ఎకరాల్లో బస్టాండ్, మరో 4 ఎకరాలో డిపోతో పాటు గ్యారెజీలను నిర్మించారు. 1982 అక్టోబరు 9వ తేదీన 17 బస్సులు 85 మంది సిబ్బందితో డిపోతో పాటు కొత్త బస్టాండును ప్రారంభించారు. మిగిలిన 6 ఎకరాల భూమిని ప్రస్తుతం ఫంక్షన్ హాళ్ల నిర్మాణం కోసం 32 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వనున్నారు. ఫంక్షన్ హాళ్ల నిర్మాణంతో సంస్థకు ఆదాయం సమకూరనున్నది. ఇప్పటికే, ఆర్టీసీ డిపో పరిధిలో 102 దుకాణాలు నిర్మించి అద్దెకివ్వగా ప్రతీ నెల రూ.9.40 లక్షల ఆదాయం సమకూరుతున్నది. అయితే, మొదట్లో డిమార్టు కోసం లీజుకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా తమ వ్యాపారాలు దెబ్బతింటాయని పట్టణంలోని వ్యాపారులంతా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని ఆశ్రయించి ఆయన ద్వారా రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. దాంతో ఈ ప్రతిపాదనలను ఉపసంహరించుకున్నారు. కాగా, కల్వకుంటకు రహదారి పక్కన ఆర్టీసీ స్థలంలో నాలాపై కొందరు అక్రమంగా డబ్బాలు, దుకాణాలను ఏర్పాటుచేశారు.

కూల్చిన శిథిలాలను తొలగిస్తున్న హైడ్రా

పటాన్‌చెరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడ సర్వే నంబర్ 12లో గతంలో రెవెన్యూ సిబ్బంది కూల్చివేసిన ఇళ్ల శిథిలాలను సోమవారం హైడ్రా బృందాల పర్యవేక్షణలో తొలగించడం ప్రారంభించారు. కూల్చివేతల అనంతరం శిథిలాలను తొలగించడంపై హైడ్రా దృష్టి సారించింది. ప్రభుత్వ భూమిని స్వాదీనం చేసుకునే క్రమంలో కూల్చివేతల శిథిలాలను ఎత్తిపోస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా గతంలో శిథిలాలను తొలగించేందుకు ప్రయత్నించగా కోర్టు స్టేటస్ కో కాపీలను ఇళ్ల యజమానులు చూపించగా తిరిగి వెళ్లిపోయారు. తరువాత కూల్చివేతలకు పాల్పడిన 12వ సర్వే నంబర్, ఇళ్ల బాధితుల డాక్యుమెంట్లపై ఉన్న 6 నంబర్ పట్టా సర్వే నంబర్‌ను జిల్లా ఏడీ సర్వేయర్‌తో సర్వే చేపట్టాలని హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. ఏడీ సర్వే జరగకుండానే హైడ్రా, రెవెన్యూ బృందాలు శిథిలాలను తొలగించేందుకు ఉపక్రమించడంతో కొంత గందరగోళం నెలకొన్నది. ఈ మేరకు బాధితులు కోర్టు ఆర్డర్ ప్రతులను చూపించినా వెనక్కు తగ్గకుండా శిథిలాలను తొలగించే పనులు కొనసాగిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో పూర్తి శిథిలాలను తొలగిస్తామని హైడ్రా సిబ్బంది పేర్కొన్నారు. కాగా శిథిలాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.


పటేల్‌గూడలో గతంలో కూల్చిన ఇళ్ల శిథిలాలను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

భూములిచ్చి ప్రయోజనమేమి?

- కాళేశ్వరం 18వ ప్యాకేజీ పనుల గతేమిటి?
- భూములు పోయినా నీళ్లొస్తాయని రైతుల ఆశలు
- ఏడాదిగా నిలిచిన కాలువ పనులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న భూనిర్వాసితులు


నర్సాపూర్ పరిధిలో అసంపూర్తిగా కాళేశ్వరం కాలువ పనులు

నర్సాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మెదక్ జిల్లాలో తలపెట్టిన 18వ ప్యాకేజీ కాలువ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఏడాది కాలంగా పనులు సాగడం లేదు. కాలువ కోసం భూములు త్యాగం చేసిన రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ జీవనాధారమైన భూములను మార్కెట్ ధర కంటే తక్కువకే ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

731 మంది రైతుల నుంచి 606 ఎకరాల భూసేకరణ

ఐదు మండలాల్లో 30 గ్రామాల మీదుగా 15 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో 18వ ప్యాకేజ్ ద్వారా కాలువ నిర్మాణ పనులను చేపట్టారు. తూప్రాన్, నర్సాపూర్, శివ్వంపేట మండలాల్లోని 731 మంది రైతుల నుంచి 606 ఎకరాల భూసేకరణ చేసి 2018లో కాళేశ్వరం కాలువ పనులు చేపట్టారు. పరిహారం విషయంలో రైతులు అప్పట్లో ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేశారు. రైతులకు పట్టాభూమికి ఎకరాకు రూ.7.50లక్షలు, అసైన్డు భూములకు ఎకరాకు రూ.5.50లక్షల చొప్పున పరిహారం అందించారు. తమ భూములు పోయిన ఈ ప్రాంతం బాగుపడుతుందన్న ఉద్దేశంతో తక్కువ ధరైనా రైతులు భూములిచ్చారు. అటు సాగుకు ఉపయోగం లేక ఇటు కాళేశ్వరం కాలువ పూర్తికాక నిరుపయోగంగా ఉండటంపై రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

మెదక్ జిల్లాలో 44 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం

18వ ప్యాకేజీలో భాగంగా మెదక్ జిల్లాలో 44 కిలోమీటర్ల మేర కాలువ నిర్మాణం చేపడుతున్నారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలో 3.50 కిలోమీటర్ల దూరం సొరంగం పనులను చేపట్టాల్సి ఉండగా 2.50 కిలోమీటర్లు పూర్తయింది. అంతేకాకుండా ఇప్పటివరకు తవ్విన కాలువకు సంబంధించి ఇంకా సిమెంటు పనులు చేపట్టాల్సి ఉంది. అప్పట్లో ప్రభుత్వం 18వ ప్యాకేజీ కాలువపై దృష్టి సారించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు నత్తనడకన సాగాయన్న విమర్శలు ఉన్నాయి. అయితే, గతేడాది రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ పనులకు మరింత గడ్డు పరిస్థితులు దాపురించాయి. 55 శాతం పనులను పూర్తి చేసిన నిర్మాణ సంస్థ ప్రభుత్వం మారడంతో కొన్ని రోజులకే సిబ్బందితో పాటు సామగ్రి అంతా తీసుకుని వెళ్లిపోయింది. దీంతో పనులు అర్ధాంతరంగా ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఏడాది అవుతున్నా ఇంకా కాలువ పనులను పట్టించుకోకపోవడంపై భూములు ఇచ్చిన రైతులు మండిపడుతున్నారు.

> **ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
>
> కాళేశ్వరం కాలువ పనుల 18వ ప్యాకేజీలో నిలిచిపోయిన విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిర్మాణ సంస్థకు బిల్లులు చెల్లించగానే త్వరలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశముంది.
>
> - రవీందర్, ఈఈ

మంత్రి సానుకూల స్పందనతో చిగురించిన ఆశలు

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సమీక్షలో కాళేశ్వరం ప్రాజెక్టులపై కూడా సానుకూలంగా స్పందించడంతో మెదక్ జిల్లాలోని 18వ ప్యాకేజీ పనులు కూడా మొదలవుతాయన్న ఆశాభావం ఇక్కడి అధికారులలో వ్యక్తమవుతున్నది. ఇక్కడి ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు చొరవ తీసుకుని మంత్రి దృష్టికి తీసుకెళ్లి త్వరలో ఈ పనులు మొదలు పెట్టి పూర్తిచేసి ఈ ప్రాంత రైతులకు మేలు కలిగేలా చూడాలని కోరుతున్నారు.




ఘనంగా దత్తాత్రేయ పల్లకీసేవ

ఝరాసంగం మండలంలోని బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమంలో సోమవారం అవధూతగిరి మహరాజ్, సిద్ధేశ్వరానందగిరి మహరాజ్, స్వామి వారి పల్లకీసేవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన పల్లకిసేవ మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. శోభాయాత్రంలో మహిళలు నిండుకలశములతో పల్లకీసేవకు ఘనంగా స్వాగతం పలికారు. కర్ణాటకలోని చాంగులేరుకు చెందిన కళాకారులు చేసిన దండకాలు, ఖడ్గాలు, భజన కీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కర్ణాటకలోని బీదర్‌కు చెందిన విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

- ఝరాసంగం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి)

రాజీవ్ గృహకల్ప ఇల్లు కోసం వేచిచూసి చనిపోయాడు

- ప్రజావాణిలో కన్నీరుమున్నీరైన వృద్ధురాలు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తమకు సొంత ఇల్లు వస్తుందని 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రాజీవ్ గృహకల్ప ఇల్లు కోసం అప్పు చేసి రూ.49వేలు కట్టినా ఇవ్వలేదని, వేచిచూసి చూసి తన భర్త రాములు అనారోగ్యంతో చనిపోయాడని సంగారెడ్డికి చెందిన వృద్ధురాలు వరలక్ష్మీ కన్నీరుమున్నీరయ్యారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె కలెక్టర్ వల్లూరు క్రాంతికి మొర పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించిన రాజీవ్ గృహకల్ప ఇళ్లను ఇప్పుడైనా ఇవ్వాలని వరలక్ష్మీతో పాటు అర్జీదారులు సురేఖ, మంగళ తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ క్రాంతితో పాటు, డీఆర్వో పద్మజారాణికి అర్జీలు అందజేశారు. పింఛన్లు ఇప్పించాలని, రుణమాఫీ చేయాలని, వివిధ సమస్యలపై ప్రజావాణికి 58 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రజావాణిలో వచ్చిన సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.


అర్జీని స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

చౌదరిపల్లిలో తెరుచుకోని బడి



రేగోడు మండలం చౌదరిపల్లిలో మూసిఉన్న పాఠశాల

రేగోడు డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరిపల్లి ప్రాథమిక పాఠశాల సోమవారం ఉపాధ్యాయులు లేక మూతబడింది. టీచర్లు రాకపోవడంతో విద్యార్థులు ఆరు బయట ఆడుకుని వెళ్లిపోయారు. గ్రామస్థులు మండల అధికారులకు ఫోన్ చేసి ఉపాధ్యాయులు రాలేరని సమాచారం ఇవ్వగా.. ఉన్నత పాఠశాలకు చెందిన టీచర్‌ను పంపించామని చెప్పారు. ఎంఈవో గురునాథ్ వివరణ కోరగా ఉపాధ్యాయులు ఆలస్యంగా వెళ్లడంతో పాఠశాల మధ్యాహ్నం నుంచి కొనసాగిందని తెలిపారు.

యువ ఆవిష్కర్తల కోసం విశ్వకర్మ అవార్డు

- 21, 22 తేదీల్లో ప్రదానం చేయనున్న ఐఐటీహెచ్

కంది, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యువ ఆవిష్కర్తలతో మెరుగైన సమాజాన్ని నిర్మించేందుకు మేకర్ భవన్ ఫౌండేషన్, ఐఐటీ హైదరాబాద్ స్టార్టప్ సంస్థ ఐటీఐసీ ఇంక్యూబేటర్‌లు సంయుక్తంగా విశ్వకర్మ అవార్డ్-2024ను అందజేయనున్నాయి. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్ వేదికగా చాలెంజ్, కోలాబ్రేట్, క్రియేట్ థీమ్‌తో ఈ నెల 21, 22 తేదీల్లో ఈ అవార్డులను ప్రకటించనున్నట్లు సోమవారం ఐఐటీహెచ్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బైన్ క్యాపిటల్స్ ఇండియా ఆఫీస్ ఛైర్‌పర్సన్ అమిత్ చంద్ర, హెచ్‌సీఎల్ వ్యవస్థాపకుడు అజయ్‌చౌదరి హాజరుకానున్నారు. నీరు, పారిశుద్ధ్యం, గ్రీన్ టెక్నాలజీ, స్మార్ట్ మొబిలిటీలపై ఎదుర్కొంటున్న సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి విద్యార్థి ఆవిష్కర్తలకు ప్రోత్సహిస్తారు. ఐఐటీహెచ్‌లో ప్రపంచస్థాయి సవాళ్లను పరిష్కరించేందుకు సాధికారత కలిగిన ఆవిష్కర్తలను ప్రోత్సహించడానికి తాము కట్టుబడి ఉన్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

గీతంలో ప్రమాణ సెక్రటేరియట్ ప్రారంభం

పటాన్‌చెరు రూరల్, డిసెంబరు 16 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో సోమవారం ప్రమాణ 2025 సచివాలయాన్ని గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్.రావు ప్రారంభించారు. గీతంలో ప్రతియేటా సాంకేతిక సాహిత్య నిర్వహణల మేలు కలయికగా నిర్వహించే మూడు రోజుల పండుగకు సన్నాహకంగా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక శిక్షణ, ఉపన్యాసాలు, ర్యాంప్ వాక్, సింఫోనీ, కన్సర్ట్ బ్యాటిల్ ఆఫ్ బ్యాండ్స్ కార్నివాల్, పలు యాజమాన్య మెలకువలను నేర్పే పోటీల సమాహారంగా ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

అటకెక్కిన అర్బన్ పార్కు

- కాజీపల్లి అటవీ అభివృద్ధి శూన్యం
- సినీ హీరో ప్రభాస్ రూ. 2 కోట్ల విరాళం
- అయినా ముందుకు సాగని పనులు
- పర్యాటక కేంద్రం.. ప్రకటనకే పరిమితం

జిన్నారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారు ప్రాంతమైన జిన్నారం మండలం కాజీపల్లి అటవీ ప్రాంతాన్ని అర్బన్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో ప్రముఖ సినీ హీరో ప్రభాస్ ఈ ప్రాంతాన్ని దత్తత తీసుకుని రూ.2 కోట్ల విరాళం కూడా అందించారు. ఈ మేరకు 2020 సెప్టెంబరులో హీరో ప్రభాస్ తోపాటు అప్పటి మంత్రి, కలెక్టర్ సహ పలువురు ప్రముఖులు హాజరై అర్బన్ పార్కు పనులకు శంకుస్థాపన సైతం చేశారు. ఇది జరిగి నాలుగేళ్లు దాటినా ఇప్పటికీ పనులు మాత్రం ప్రారంభించలేదు.


అర్బన్ ఫారెస్ట్‌గా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేసిన కాజీపల్లి అటవీ ప్రాంతం

అర్బన్ పార్కుకు ప్రణాళికలు..

రాష్ట్ర రాజధానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాజీపల్లి అటవీ ప్రాంతం 1,650 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. నగరంలో వాయు కాలుష్యం భారీగా పెరిగిపోతుండడంతో సమీపంలోనే ఉన్న ఈ ప్రాంతాన్ని దశలవారీగా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం పూనుకున్నది. అందులో భాగంగా అర్బన్ పార్కు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇందులో వాకింగ్ ట్రాక్, ట్రెక్కింగ్, ట్రీ పార్కు, ప్రత్యేక మొక్కల పెంపకం, వ్యూ పాయింట్, వృక్షాలకు రక్షణ చర్యలతో పాటు తదితర వసతుల కల్పనకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు వావిలాల ఫారెస్ట్ రేంజ్ పరిధిలో కేవలం ఫెన్సింగ్, మట్టి రోడ్డు నిర్మించి ఆ తరువాత చేపట్టాల్సిన ప్రధాన పనులను విస్మరించారు.

నిధులున్నా.. నిర్లక్ష్యం..

కాజీపల్లి అటవీ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టగా, నాటి ఎంపీ సంతోష్ కుమార్ సూచనతో హీరో ప్రభాస్ తన తండ్రి యూవీఎస్ రాజు విరాళం అందజేశారు. అవసరమైతే మరిన్ని నిధులు అందజేస్తానని ప్రకటించారు. దీంతో అప్పట్లో ఇది ప్రత్యేకత సంతరించుకున్నది. ఎంతో సమున్నత లక్ష్యంతో నిధులు సమకూర్చినా


శిలాఫలకం ఆవిష్కరణ అనంతరం పార్క్ అభివృద్ధి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హీరో ప్రభాస్, ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

పనుల ప్రారంభంలో నిర్లక్ష్యం వహించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు పార్కు ఏర్పాటు జరుగుతుందా.. లేదా అనేది సందేహం ప్రజల్లో నెలకొన్నది. ప్రభాస్ అందించిన విరాళం ఏ మేరకు ఖర్చు చేశారో తెలియాల్సి ఉన్నది. ఒక మంచి పని కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చినా ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు మండిపడుతున్నారు. మండలంలోని వావిలాల ఫారెస్ట్ సెక్షన్ పరిధి ఉన్నా స్థానికంగా సెక్షన్ కార్యాలయం లేకపోవటంతో మండల వాసులకు అటవీ శాఖ అధికారులు ఎవరో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్బన్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

స్టీల్ రాడ్ తగిలి కార్మికుడి మృతి


రాహుల్ (ఫైల్)

మనోహరాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్టీల్ రాడ్ తగిలి కార్మికుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం రంగాయపల్లి గ్రామంలోని ఎమ్ఎస్ ఆగర్వాల్ స్టీల్ పరిశ్రమలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాహుల్ (23) పని చేస్తూ గౌరారంలో నివాసముంటున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం మధ్యాన్నం పరిశ్రమలో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు స్టీల్ రాడ్ పొట్టలో తగిలింది. దీంతో అతడిని వెంటనే కొంపల్లిలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు.

35 రోజుల వ్యవధిలో ఇద్దరు కార్మికులు మృతి

ఎమ్ఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో 35 రోజుల వ్యవధిలోనే ఇద్దరు కార్మికులు విధుల్లో ప్రమాదం చోటుచేసుకుని మృతి చెందడంపై భద్రతా ఏర్పాట్లపై అనుమానం కలుగుతుంది. గత నెల 12న ఓడిశా రాష్ట్రానికి చెందిన జిన్టుగౌడ్ కన్వేయర్ బెల్టు తగిలి చనిపోగా, ప్రస్తుతం రాహుల్ మృతిచెందాడు. పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యంతో కార్మికులకు భద్రతకు తగిన చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కార్మికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి పరిశ్రమపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మిరుదొడ్డి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యాదయ్య(60)కు ఇద్దరు కుమారులు. గతంలో భూమిని విక్రయించి అతని పెద్దకుమారుడు రమేష్‌కు రూ.3.50 లక్షలు ఇచ్చాడు. తర్వాత చిన్నకొడుకు రవికి రూ.50వేలు ఇచ్చాడు. డబ్బుల పంపకాల విషయంలో ఇంట్లో రోజూ గొడవలు జరుగుతున్నాయి. దీన్ని భరించలేక లేక యాదయ్య సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తెగిపడిన వైర్లు.. పాడి గేదె మృతి

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం


మృతిచెందిన గేదె వద్ద రోదిస్తున్న బాధితుడు మల్లయ్య

అల్లాదుర్గం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు తెగిపడి పాడి గేదె మృతి చెందగా, త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లాదుర్గంకు చెందిన రైతు మేకలకాడి మల్లయ్య పాడి గేదెలు మేతకు వెళ్లి ఆదివారం సాయంత్రం ఇంటికి తిరిగి వస్తున్నాయి. గ్రామ శివారులోని శ్రీ రేణుకామాత ఆలయం సమీపంలోకి రాగానే ఎల్‌టీ లైన్‌కు విద్యుత్ తీగ తెగి నేలపై పడుతూ పాడి గేదెకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆ సమయంలో అక్కడున్న రైతులు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. మృతిచెందిన పాడి గేదె విలువ రూ. లక్ష ఉంటుందని, ఆదుకోవాలని తహసీల్దార్‌ను సోమవారం బాధితుడు కోరాడు.

ఇంట్లో పట్టపగలే చోరీ

- బంగారం, నగదు అపహరణ


చిందరవందరగా పడేసిన వస్తువులు

కంగ్టి, డిసెంబరు 16(ఆంధ్ర జ్యోతి) : పట్టపగలే ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన సంఘటన మండల పరిధిలోని దెగుల్‌వాడీలో చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులరాలు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దుదాలే రమాదేవి అదే గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వహిస్తుంది. రోజు మాదిరిగానే సోమవారం ఆమె అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లగా, భర్త ధన్‌రాజ్ తన తల్లితో కలిసి పొలానికి వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగులు మధ్యాహ్నం ఇంటి తాళం పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి అందులో ఉంచిన ఐదున్నర తులాల బంగారు నగలు, రూ.1.50 లక్షల నగదు దొంగిలించారు. పొలం నుంచి వచ్చిన ధన్‌రాజ్ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయస్థాయి పోటీలకు వర్గల్ నవోదయ విద్యాలయ బృందం


వర్గల్ విద్యాలయంలో నిర్వహిస్తున్న యూత్ పార్లమెంట్ (ఫైల్)

వర్గల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం యూత్ పార్లమెంట్ బృందం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 26వ జాతీయ స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు 2025 ఫిబ్రవరి నెల4, 5 తేదీల్లో జవహర్ నవోదయ విద్యాలయం నాగపూర్, పూణే రీజియన్లలో నిర్వహించబడుతాయని తెలిపారు. ఎంపికైన వర్గల్ యూత్ పార్లమెంట్ బృందాన్ని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అభినందించినట్లు తెలిపారు. సెప్టెంబరులో వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్‌లో ఎంపీ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారని గుర్తు చేశారు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

- పదోరోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె


సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మె పదవ రోజుకు చేరింది. ఇందులో భాగంగా సోమవారం సమ్మె శిబిరం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సమ్మెకు జిన్నారం ఎంఈవో, అమీన్‌పూర్ ఎంఈవోలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని, లేకపోతే మినిమం టైం స్కేలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎం.దత్తు, ప్రధాన కార్యదర్శి అనీల్‌చారి, శేషాద్రి, లక్ష్మణ్, రమేశ్, భాస్కర్, లలిత, రాణి, రజిత, భానుశ్రీ, సుజాత, కవిత, విష్ణు, నరేశ్, నర్సింగ్, నాగరాజు, విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడదకు నీలిబాటిళ్లతో చెక్


కల్పగూర్‌లో ఇళ్ల వద్ద ఏర్పాటు చేసిన నీలిరంగు బాటిళ్లు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విశ్వాసానికి ప్రతీకగా నిలిచే శునకాలు (కుక్కలు) ఇటీవల కాలంలో చిన్నా పెద్దా అనే తేడాలు లేకుండా జనాలపై విరుచుకుపడి దాడులు చేస్తున్నాయి. వీటి బారిన పడిన ప్రజలు ఆసుపత్రుల చుట్టు తిరుగుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుక్కల బెడద నుంచి తమ పిల్లలను, తమని తాము రక్షించుకునేందుకు సంగారెడ్డి మండలం కల్పగూర్ గ్రామస్థులు వినూత్నంగా ఆలోచించి బట్టలకు వేసే నీలిని వాటర్ బాటిళ్లలో నింపి ఇంటి ఆవరణలో ఏర్పాటు చేశారు. నీళి బాటిళ్లను చూసి కుక్కలు అటు వెళ్లేందుకు సాహసించవని గ్రామస్థులు చెబుతున్నారు. నీలి బాటిళ్లను ఏర్పాటు చేసిన నాటి నుంచి కుక్కల బెడద తగ్గిపోయిందని చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- పలువురికి గాయాలు ● వేర్వేరు చోట్ల ఘటనలు

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి. కల్హేర్ మండలంలో ద్విచక్రవాహనంపై నుంచి పడి వలస కూలీ, మల్కాపూర్ శివారులో లారీ ఢీకొని యువకుడు దుర్మరణం చెందారు. ఇక గజ్వేల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బస్సు కారును ఢీకొట్టడంతో ఓ మహిళ మృతిచెందగా, కుటుంబ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు.


కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కల్హేర్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వలస కూలీ మృతిచెందాడు. స్థానికులు, కల్హేర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన సకల్‌దేవ్(35) ఓ రైసుమిల్లులో కూలీగా పని చేస్తున్నాడు. మరో వలస కూలీ కుందన్‌తో కలిసి అతడు ఆదివారం బాచేపల్లి నుంచి మాసాన్‌పల్లి చౌరస్తా వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. చౌరస్తా సమీపంలో 161 జాతీయ రహదారిపై అదే సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న బాచేపల్లి శెకలికుంటతండాకు చెందిన బాబునాయక్‌ను ఢీకొట్టి కిందపడిపోయారు. దీంతో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని ఆస్పత్రికి తరలించారు. సకల్‌దేవ్ మార్గమధ్యలోనే మృతిచెందాడు. కిందపడిన వీరిపై నుంచి గర్తు తెలియని వాహనం వెళ్లినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కల్హేర్ ఎస్ఐ వెంకటేశం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి..

కొండాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సదాశివపేట మండలం నాగ్‌సాన్‌పల్లికి చెందిన వెండికోల్ రాహుల్ (20) సోమవారం ఉదయం ద్విచక్రవాహనంపై తన అక్కను తీసుకుని సంగారెడ్డిలోని రాజంపేటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో మల్కాపూర్ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై కిష్టయ్యగూడెం చౌరస్తా వద్దకు రాగానే సంగారెడ్డి వైపు నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో రాహుల్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ హరిశంకర్ తెలిపారు.

కారును ఢీకొట్టిన బస్సు ఘటనలో..

గజ్వేల్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కారును వెనక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో మహిళ మృతి చెందగా, పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లోని దమ్మాయిగూడకు చెందిన మోతే సుధాకర్, శ్రావణి దంపతులకు సాయి, లతీక్ ఇద్దరు కుమారులు. మిరుదొడ్డిలో ఉండే సమీప బంధువు చనిపోవడంతో సోమవారం జరిగే దశదినకర్మకు సోదరుడు గణేష్, భార్య శ్రావణి(38) పిల్లలతో కలిసి కారులో బయలుదేరారు. ఇదే సమయంలో జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జేబీఎస్ నుంచి జగిత్యాలకు వెళ్తుంది. రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ తర్వాత ఔటర్ రింగ్ రోడ్డు వద్ద మోతే సుధాకర్ కారును క్యాసారం వైపు వెళ్లేందుకు మలుపు తిప్పడంతో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టింది. దీంతో శ్రావణి, లతీక్‌కు తీవ్ర గాయాలు కాగా, సుధాకర్, గణేష్, సాయికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా శ్రావణి చికిత్స పొందుతూ మృతి చెందింది. మిగతా క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం వంటిమామిడిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రహదారులను అభివృద్ధి చేయాలి

- ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్


కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రోడ్లను అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని బీదర్ ఎంపీ సాగర్‌కంద్రే తదితరులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రోడ్ల అనసందాన్ని పెంపొందిస్తే రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుందన్నారు. మెదక్, వికారాబాద్ సంగారెడ్డి జిల్లాలోని రహదారుల ప్రాముఖ్యతను వివరించారు. పరిశ్రమల కేంద్రాలుగా సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు ప్రాచుర్యం పొందుతున్నాయన్నారు. మెదక్ ఆటోమోబైల్ తయారీ, పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిందన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), ప్రముఖ సిమెంటు సంస్థలు తాండూరులో స్థాపించిన నేపథ్యంలో రహదారుల అనుసంధానం ఆవశ్యమన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని రోడ్ల అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.


ఎల్లమ్మతల్లికి 11కిలోల వెండి కవచములు


అధికారులకు వెండి కవచములను అందజేస్తున్న దృశ్యం

చేర్యాల, డిసెంబరు 16: స్వర్ణమకుటం, కోరమీసరాజసంతో దర్శనమిస్తున్న కొమురవెల్లి మల్లన్న మాదిరిగా గుట్టపై కొలువుదీరిన స్వామివారి సహోదరి ఎల్లమ్మతల్లి, పోచమ్మతల్లి భక్తులకు ఇక నుంచి రజత మయంతో దర్శనమివ్వనుంది. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన గిల్లా కుమార్‌యాదవ్ రూ.10లక్షల వ్యయంతో 11కిలోల వెండి కవచములు తయారు చేయించి బహూకరించారు. సోమవారం ఆలయ పర్యవేక్షకుడు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, శంకర్ సమక్షంలో కవచాలను అధికారులకు అందించి మొక్కులు చెల్లించుకున్నాడు. మల్లన్న బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్లకు వీటిని అలంకరించనున్నారు. అలాగే స్వామివారి నిత్య ప్రసాద తయారీశాలలో రూ.3లక్షల వ్యయంతో ఫర్నీచర్ చేయించి ఉదారత చాటుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చక సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, ఉప ప్రధాన అర్చకుడు మహదేవుని సాంబయ్య, మల్లికార్జున్ స్వామివారిప్రసాదం అందించి కుమార్‌యాదవ్ దంపతులను ఆశీర్వదించారు.

వాగ్దానాల్లోనే రూ.కోట్లు..

- నిధుల కేటాయింపులో ఏడుపాయలకు మొండి చెయ్యి


ఏడుపాయల వన దుర్గా మాత ఆలయం

పాపన్నపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వాగ్దానాలు కోటలు దాటితే అభివృద్ధి అడుగు దాటదన్న సామెతకు సరిపోతుంది ఏడుపాయల అభివృద్ధి తీరు. గత ప్రభుత్వం ఏడుపాయల అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించి అభివృద్ధి చేయలేదు గానీ తాము అధికారంలోకి వస్తే మరిన్ని నిధులతో ఆధ్యాత్మిక క్షేత్రాన్ని పర్యాటక క్షేత్రంగా మారుస్తామని ఓ బహిరంగ సభలో ప్రకటన చేసిన కాంగ్రెస్.. తీరా అధికారంలోకి వచ్చినంక పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం నిధుల విడుదలలో ఏడుపాయలపై వివక్ష చూపుతుందన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జనమేజయుడు సర్పయాగం చేసిన స్థలిగా గరుడ గంగగా పిలవబడే మంజీరా నది ఏడుపాయలుగా చీలి ప్రవహించే స్థలిలో వెలసిన ఏడుపాయల దుర్గామాత ఏటా లక్షలాది భక్తుల ఇలవేలుపై మొక్కులు అందుకుంటుంది. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన ఏడుపాయల దుర్గమ్మ ఆలయ అభివృద్ధిని పక్కన బెట్టి ఇతరత్రా ఆలయాలకు ప్రాముఖ్యతనిస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద తాము అధికారంలోకి వస్తె ఏడుపాయల ఆలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక క్షేత్రాలుగా అభివృద్ధి చేస్తామన్న హామీని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. ఏటా రూ.10 కోట్లకు పైనే ఆదాయం వచ్చే క్షేత్రాన్ని వదిలిపెట్టి ప్రభుత్వానికి ఆదాయ వనరులు కల్పించని వాటికి నిధులు కేటాయించడం చర్చనీయాంశంగా మారింది. ఏడుపాయల ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తే భక్తులకు సౌకర్యాలు కల్పించే వీలుంటుంది.

ఆసియా ఖండంలోనే రెండవ అతి పెద్ద చర్చిగా వెలుగొందుతున్న ఆలయానికి ప్రపంచ దేశాల నుంచి చర్చి అభివృద్ధి కోసం డాలర్ల రూపేణా కోట్ల రూపాయలు నిధులు వస్తుంటాయి. అయినా ప్రభుత్వం రూ.29 కోట్లు కేటాయించడం హర్షదాయకమైనప్పటికీ ఇదే తరహాలో ఏడుపాయల పర్యాటక అభివృద్ధికి కేటాయిస్తే ఈ ప్రాంత ప్రజలు మరింత హర్షించేవారు. స్థానిక ఎమ్మెల్యే ఏడుపాయలకు కూడా పెద్దపీట వేయడమే కాకుండా మెదక్ జిల్లాలోని మరికొన్ని ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా మార్చడానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని చెబుతన్నా.. ముందుగా ఏడుపాయలకు నిధుల కేటాయింపు జరిగి ఉంటే బాగుండేదని భక్తులు చర్చించుకుంటున్నారు. ఇదిఇలా ఉంటే ఎన్ని ప్రభుత్వాలు మారినా హామీలకే పర్యాటకం అన్న చందంగా మిగలనుందా అన్న విమర్శలు కూడా లేకపోలేవు.

ఉత్సాహంగా క్రాస్ కంట్రీ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలు

● రాష్ట్రస్థాయికి 32 మంది క్రీడాకారులు

మెదక్ అర్బన్ డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): 10వ తెలంగాణ స్టేట్ అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ జిల్లాస్థాయి పోటీలు సోమవారం స్థానిక స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాస్థాయి అండర్-16, 18, 20 బాల బాలికలకు పరుగు పందెం విభాగాల్లో నిర్వహించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 32 మంది క్రీడాకారులు ఈ నెల 22న నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ తెలిపారు.

అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్‌కు గురుకుల విద్యార్థుల ఎంపిక

జిన్నారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అకాడమి (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-14 క్రికెట్ టోర్నీకి ఇద్దరు గురుకుల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి రాథోడ్ ధనుష్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, మరో విద్యార్థి కార్తీక్ ఉమ్మడి మెదక్ జట్టు తరుపున రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 17నుంచి నిర్వహించే అండర్-14 పాఠశాల జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

టీబీ నివారణపై అవగాహన

చిన్నశంకరంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దరిపల్లి గ్రామంలో సోమవారం టీబీ వ్యాధిగ్రస్థులకు నివారణపై పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పలు సూచనలు చేసి, అవగాహన కల్పించారు. టీబీ వ్యాధిని నియంత్రించేందుకు మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న అదనపు కలెక్టర్

పాపన్నపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయల వనదుర్గామాతను జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సామాజిక సేవలకు అవార్డు

జిన్నారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలకు గానూ కేజేఆర్ ట్రస్టు నిర్వాహకుడు ఆనందకృష్ణారెడ్డికి సేవారత్న అవార్డును ప్రదానం చేశారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ సంస్థ ఆనందకృష్ణారెడ్డికి సేవారత్న అవార్డును అందజేశారు. ఉపాధి, పారిశ్రామికరంగ కూలీల సంక్షేమం, సామాజిక సేవలకు గానూ ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు.

'భగీరథ పనులు గడువులోగా పూర్తి చేయాలి'

జిన్నారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి నీటి సరఫరా చేపట్టాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి అన్నారు. సోమవారం బొల్లారంలోని 11, 22వ వార్డులలో పర్యటించిన చైర్ పర్సన్ రోజారాణి అక్కడ జరుగుతున్న మిషన్ భగీరథ, సీసీ రోడ్డు పనులు పరిశీలించారు.

రేపటి నుంచి 'ఉర్సే షరీఫ్'

కోహీర్ డిసెంబరు 16: (ఆంధ్రజ్యోతి): కోహీర్‌లోని హజరత్ సయ్యద్ మౌలానా మోహీజోద్దీన్ దర్గాలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో 766వ ఉర్సే షరీఫ్ ఉర్సు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఉర్సు కమిటీ సభ్యులు కోరారు.

కనువిందుగా ప్రకృతిఅందాలు





అర్బన్‌పార్కులో నిర్మించిన స్వాగతతోరణం(గేటు) వాచ్‌టవర్, గజేల దృశ్యాలు



వాచ్‌టవర్ పైనుంచి కనిపించే సుందర దృశ్యం

జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 25శాతం ఉన్న అడవులను 33 శాతానికి పెంచేందుకు అటవీశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణ ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అర్బన్ పార్కు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రానప్పటికీ ప్రస్తుతానికైతే ఆహ్లాదాన్ని పంచుతున్నది. అర్బన్ పార్కులో నిర్మించిన వాచ్‌టవర్, గజేల, స్వాగత తోరణం (గేటు) చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అవి సిమెంటు కట్టడాలే అయినప్పటికీ కలపతో తయారు చేసిన నిర్మాణాలను తలపిస్తాయి. అర్బన్‌పార్కులోకి వెళ్లి వాచ్‌టవర్‌ను ఎక్కి చూస్తే కనుచూపుమేర ప్రకృతి అందాలు పచ్చదనంతో కనువిందు చేస్తున్నాయి. ఇటీవల విద్యార్థులు వనసందర్శనలో భాగంగా అర్బన్‌పార్కులోకి వెళ్లి వాచ్‌టవర్‌ఎక్కి ప్రకృతి అందాలను తిలకిస్తూ సందడి చేశారు. ముఖిబాగ్‌లో ఏర్పాటుచేసిన అర్బన్‌పార్కును వినియోగంలోకి తెస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

జహీరాబాద్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి)



అర్బన్‌పార్కులో వాచ్‌టవర్ ఎక్కి ప్రకృతి అందాలను తిలకిస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ శోభారాణి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

పాపన్నపేట/టేక్మాల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. ఆయన సోమవారం పాపన్నపేట మండల పరిధిలోని అన్నారం, అబ్లాపూర్, బాచారం గ్రామాల పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదేవిధంగా టేక్మాల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల రికార్డులను పరిశీలించారు. వివిధ పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రతను, మధ్యాహ్న భోజనం తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో మెనూ ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనం నిర్వాహకులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఏఎంవో సుదర్శనమూర్తి, మండల విద్యాధికారి ప్రతాప్‌రెడ్డి, పాపన్నపేట కాంప్లెక్స్ హెచ్‌ఎం మహేశ్వర్, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు. అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు విఠల్‌రెడ్డి సందర్శించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు.

● రామాయంపేట: మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ శోభారాణి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అంతకు ముందు ఆమె మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి సోమవారం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు మాజీ ఎంపీపీ రమేష్ రెడ్డి,నాయకులు ఉన్నారు.

మెడికల్ కళాశాలలో క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే



క్యాంటీన్ ప్రారంభిస్తున్న మైనంపల్లి రోహిత్, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో సోమవారం మహిళా శక్తి పథకం కింద ఏర్పాటుచేసిన మెస్‌ను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, వైద్యరంగంలో మెదక్ జిల్లాను అగ్రగామిలో ఉంచుతామన్నారు. ఈ రోజు నుండి ప్రత్యక్ష తరగతులు ప్రారంభమయ్యాయని, ప్రతీ విద్యార్థి తరగతులను హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష తరగతులు నిర్వహించే ఆడిటోరియంను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శివదయాల్, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే.. సాఫీగా..

(5వ పేజీ తరువాయి)

రేగోడ్ 6,933, పెద్దశంకరంపేట 9,804, చిన్నశంకరంపేట 9,665, శివంపేట 11,721, టేక్మాల్ 9,161, తూప్రాన్‌లో 5,275 దరఖాస్తులు, తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో 3770 దరఖాస్తులు వచ్చాయి.

సర్వే వేగంగా జరుగుతోంది

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ పర్యవేక్షణలో 469 మంది పంచాయితీ కార్యదర్శులు, 75 మంది మున్సిపల్ వార్డు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

-యాదయ్య, జిల్లా పంచాయతీ అధికారి, మెదక్

ఆలస్యం.. అనుమానం!

(5వ పేజీ తరువాయి)

చేశారు. జిల్లా కలెక్టర్ అధికారిక వెబ్‌సైట్‌లో జాబితా పొందుపర్చగా, ఈ నెల 18 వరకు అభ్యంతరాల స్వీకరిస్తామన్నారు.

ఎవరి కోసం ఈ సాగదీత?

వైద్య ఆరోగ్యశాఖలో దశలవారీగా పోస్టుల భర్తీ పలు అనుమానాలకు తావిస్తున్నది. 97 పోస్టులు మంజూరు చేసినా కేవలం వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని బస్తీ, పల్లె దవాఖానా డాక్టర్లను మాత్రమే ఎందుకు భర్తీ చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మిగతా పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. పోస్టుల భర్తీపై ఉన్నతాధికారులే దశల వారీగా భర్తీ చేయాలనే ఆదేశాలిస్తున్నారా? లేక వైద్య ఆరోగ్య శాఖ అధికారులే ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు పోస్టుల భర్తీలో ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొన్నదని అభ్యర్థులు వాపోతున్నారు. దశల వారీగా భర్తీ చేస్తే తమకు అనుకూలంగా ఉన్న వారికే పోస్టులు కట్టబెట్టొచనే ఆలోచనలో జిల్లా వైద్య అధికారులు, కొందరు ఉద్యోగులు ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే ఈ రకమైన పంథాను ఎంచుకున్నట్లు చర్చ జరుగుతున్నది. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. గుట్టుచప్పుడు కాకుండా దశల వారీగా పోస్టుల భర్తీతో పాటు నియామకాల జాప్యంపై ఉన్నతాధికారులు, అభ్యర్థులు అప్రమత్తంగా ఉంటూ ప్రశ్నించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టులు

చిన్నశంకరంపేట/పెద్దశంకరంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచుల జేఏసీ పిలుపు మేరకు చలో హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నవారిని పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ మేరకు మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలో సర్పంచుల ఫోరం మండలం మాజీ అధ్యక్షుడు యాదగిరి యాదవ్‌తో పాటు మాజీ సర్పంచులు పోచయ్య, దయానంద్ యాదవ్, లక్ష్మణ్, లక్ష్మీ సిద్దిరాములు, జ్యోతి ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, పద్మ మల్లేశం తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దశంకరంపేటలో మాజీ సర్పంచులు రవీందర్, సూర్య ప్రకాశ్, శంకర్‌గౌడ్, విఠల్‌గౌడ్ తదితరులను పోలీసులు ఆరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రేగోడ మండలంలో సర్పంచుల ఫోరం మెదక్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సుంకే రమేష్, మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు హనుమంతు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అరెస్టయిన మాజీ సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి చేసిన బిల్లులు ఇవ్వమంటే ప్రభుత్వం అరెస్టులు చేయడం ఏమిటని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు.

కార్మికుల వెతలు ప్రభుత్వానికి పట్టవా?



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్లుగా పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికుల వెతలు ప్రభుత్వానికి పట్టవా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ప్రశ్నించారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వివిధ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నా నేటికీ కనీస వేతనాలు ఇవ్వకుండా శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించి ఈఎస్ఐ, పీఎఫ్ చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మిషన్ భగీరథ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, రాములు, కృష్ణ, వెంకటేశ్, రాములు, శేఖర్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు. కాగా అంగన్‌వాడీ ఉద్యోగులకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పీడీ జ్యోతికి వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసినవారిలో అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు శశికళ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి అంగన్‌వాడీలు ఉన్నారు.

● నారాయణఖేడ్: అంగన్‌వాడీ టీచర్ల పెండింగ్ వేతనాలు, మెస్ బిల్లులు చెల్లించాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి నల్లవల్లి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఖేడ్ సీడీపీవో సుజాతకు వినతిపత్రం అందజేశారు.

ఎక్స్‌కవేటర్ ఢీకొని తెగిపడిన కాలు



ప్రమాదంలో గాయపడిన వెంకటేశ్

తూప్రాన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం వట్టూరు వద్ద బైక్‌ను ఎక్స్‌కవేటర్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ప్రమాదంలో బాధితుడి కాలు తెగి దూరంగా పడింది. తూప్రాన్ ఎస్ఐ -2 యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన బెట్టు వెంకటేశ్(39) సోమవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై తూప్రాన్ మండలం వట్టూరు వద్దగల పొలానికి బయలుదేరాడు. ఈ క్రమంలో అతడు సుభాష్‌రెడ్డిఫామ్ హౌజ్ వద్దకు వెంకటేశ్ చేరుకోగానే, ఫాంహౌజ్ నుంచి ఎక్స్‌కవేటర్ వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటేశ్ కాలు తెగిపోయి దూరంగా పడిపోయింది. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

అదుపు తప్పి లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

వెల్దుర్తి, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్ మూల మలుపు వద్ద సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. నర్సాపూర్ నుంచి వెల్దుర్తి వైపు వడ్ల లోడుతో వెళ్తున్న లారీ మన్నెవారి జలాల్‌పూర్ గ్రామంలోని మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈఘటనలో నర్సాపూర్‌కు చెందిన డ్రైవర్ పెంటయ్య(45) స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఆసుపత్రికి తరలించారు. లారీలో ఉన్న వడ్ల బస్తాలు చెల్లాచెదురుగా పడిపోయాయి.

చోరీకి యత్నించిన నలుగురికి రిమాండ్

మాసాయిపేట/చేగుంట.డిసెంబరు,16.(ఆంధ్రజ్యోతి):దొంగతనానికి యత్నించిన నలుగురు వ్యక్తులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు చేగుంట పోలీసులు తెలిపారు. ఎస్ఐచైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలం మక్కరాజ్ పేట గ్రామానికి చెందిన బాల్‌శెట్టి స్వామిగౌడ్ ఇంట్లో శనివారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ మహమ్మద్, మహమ్మద్ సుమేర్,ఎస్‌కే మునీర్, సయ్యద్ అబ్దుల్ సత్తార్ అనే వ్యక్తులు చొరబడి దొంగతనానికి ప్రయత్నించారు. ఇంటి యజమాని బాల్‌శెట్టి స్వామిగౌడ్ ఫిర్యాదు మేరకు నలుగురు నిందితులను సోమవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

డీఈఐసీలో కార్డియాక్ హెల్త్ క్యాంపు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని డీఈఐసీ కేంద్రంలో రెయిన్‌బో హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం కార్డియాక్ హెల్త్ క్యాంపు నిర్వహించారు. సుమారు 50 మంది పిల్లలకు గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డా.శశాంక్ దేశ్‌పాండే పర్యవేక్షణలో క్యాంపు జరిగింది. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వనజారెడ్డి ఆదేశాల మేరకు సెక్రటరీ ప్రసాద్‌వీర్‌కుమార్ ఆధ్వర్యంలో పిల్లలకు ఆహార ప్యాకెట్లు, మంచినీటి బాటిళ్లను ఉచితంగా అందజేశారు.

పొలాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శివ్వంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభం ధ్వంసమై వైర్లు తెగిపడి సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో వరినారు ఎండిపోతున్నదని నిరిసిస్తూ కొంతాన్‌పల్లిలో వరినారుతో రైతులు నిరసన చేపట్టిన విషయం తెలిసిందే. ఈ విషయం శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితం కావడంతో విద్యుత్ అధికారులు స్పందించారు. పై అధికారుల ఆదేశాలతో ధ్వంసమైన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం తెగిన వైర్లకు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు లైన్‌మెన్ జీవన్‌రెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాం పంపిణీ

మెదక్, కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ మండలం మక్త భూపతిపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమ సోమవారం యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరి, ఆయా సిద్దమ్మ, చిన్నారులు పాల్గొన్నారు.


గ్రూపులు వీడి ఐక్యమవుదాం: మాజీ ఎమ్మెల్యే

రామాయంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'సీనియర్, జూనియర్ అనే తేడా లేకుండా అందరం సమష్టిగా పని చేద్దాం. అపుడే ప్రజా సమస్యలు తీర్చే వీలుంటుంది ఇందుకోసం గ్రూపులు విడనాడుదాం' అని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావ్ హితవు పలికారు. సోమవారం రామాయంపేట వచ్చిన సందర్భంగా పార్టీలోని గ్రూపు విభేదాలపై సుమారు గంటపాటు ఇరు వర్గాలతో చర్చించారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు మానుకోవాలన్నారు. ఇక మీదట అందరూ ఐక్యమై పార్టీకి వెన్నుదన్నుగా ఉండాలని సూచించారు.

మెదక్‌లో అంబేడ్కర్ భవనం నిర్మించాలి

మెదక్ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ భవనం నిర్మించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్ని సంఘాల భవనాలు నిర్మిస్తున్నప్పటికీ అంబేడ్కర్ భవన నిర్మాణం చేయక పోవడం దురదృష్టమన్నారు. గత పదేళ్ల నుంచి నిలిచిపోయిన అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను అత్యవసరంగా పూర్తి చేయాలన్నారు. మెదక్ వెల్‌కమ్ బోర్డు, రాందాస్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్ ప్రాంగణంలో మహనీయుల విగ్రహాలను యథావిధిగా ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. విగ్రహాలను ఈ డిసెంబర్ లోపే ప్రతిష్ఠాపన చేయకుంటే దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అస్తరుగళ్ల బాలరాజ్. మెదక్ జిల్లా దళిత సంఘాల సీనియర్ నాయకుడు పాతూరి రాజు, ముస్కూరి వెంకట్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.200 కోట్ల అభివృద్ధి నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా



రామాయంపేటలో మాట్లాడుతున్న పంజా విజయ్ కుమార్

రామాయంపేట, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి): మెదక్ ప్రాంత అభివృద్ధికి రూ.200 కోట్లు తెచ్చామని ఎమ్మెల్యే పదేపదే ప్రచారం చేయటంలో వాస్తవాలు లేవని యోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి, మాజీ జడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఆ నిధులు తెచ్చినట్టు నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఈ మేరకు సోమవారం రామయంపేటలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన సవాల్ ను మైనంపల్లి స్వీకరిస్తారా.. నిధుల మంజూరు నిజం కాదని తప్పు ఒప్పుకుంటారా.. అని ప్రశ్నించారు. సమావేశంలో వేల్పుల సిద్ధిరాములు, కన్నయ్య, శేఖర్, భరత్ లు ఉన్నారు.

హామీలను విస్మరించిన సర్కార్: టీపీటీఎఫ్



అదనపు కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంగటి యాదగిరి

మెదక్ అర్బన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విస్మరించిందని, ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా అమలు కాలేదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కొంగటి యాదగిరి విమర్శించారు. హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ సంగయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సందడి

హత్నూర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన హత్నూర-మాధుర గ్రామ శివారులోని దత్తాత్రేయుల క్షేత్రంలో వారం రోజులుగా కొనసాగుతున్న దత్త జయంతి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. సోమవారం ఉదయం దత్తాత్రేయ స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. పాచి బండ్ల ఊరేగింపుతో పాటు పల్లకీ సేవ చేశారు.

● కోహీర్: మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాలు సోమవారం రథోత్సవంతో ఘనంగా ముగిశాయి. చివరి రోజైనా సోమవారం గొల్ల బీర్ల వారిచే కేతమ్మ, మల్లికార్జున స్వామి వేషధారణలో ఊరేగింపుగా ఆలయం వరకు వచ్చి కేతమ్మ మల్లికార్జున స్వామి వార్ల లగ్న కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు భాజా భజంత్రీలతో మందిరం చుట్టూ ఎంతో వైభవంగా రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

● పుల్‌కల్: చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ అనంత పద్మనాభ స్వామి పునశ్చరణ మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా గణపతి పూజ, పుణ్యాహవాచన, యాగశాల ప్రవేశం, ప్రధాన కలశ స్థాపన, గణపతి హోమం, జలాధివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. జ్యోతిర్వాస్తు విద్యాపీఠం డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి వైదిక నిర్వహణలో ఇత్యాది పూజ కార్యక్రమాలు జరిగాయి. కాగా, అనంత పద్మనాభ స్వామిని రంగంపేట పీఠాధిపతి మదనానంద స్వామి దర్శించుకున్నారు.



గుమ్మడిదల: బొంతపల్లి అయ్యప్ప ఆలయంలో దివ్య మహా పడిపూజకు హాజరైన భక్తజనం

● మనోహరాబాద్: మార్గశిర బహుళ పాడ్యమి ఆరుద్ర నక్షత్రం ధనుర్మాసం మొదటి రోజు సోమవారాన్ని పురస్కరించుకుని మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో అయ్యప్పస్వాములు రుద్రాభిషేకం నిర్వహించారు.

● చిన్నశంకరంపేట: మండలంలోని జంగరాయి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలోని గంగాదేవి ఆలయ వార్షికోత్సవ మహోత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, హోమ పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. హోమ పూజల వద్ద దంపతులు కూర్చొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కోహీర్: జాతర ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

● గుమ్మడిదల/పెద్దశంకరంపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బొంతపల్లి వీరన్నగూడెం అయ్యప్ప స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన అయ్యప్ప స్వామి దివ్య మహా పడిపూజ, ఆలయ వార్షికోత్సవాలు భక్తులను ఆధ్యాత్మిక సందడిలో ముంచెత్తాయి. ఏటా డిసెంబరు 15న మండల పూజలు ముగించుకున్న అనంతరం అర్ధరాత్రి తర్వాత అయ్యప్పస్వామివారి దివ్య మహాపడిపూజను ఘనంగా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తున్నది. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ ఆవరణలో సాయంత్రం 7 గంటల ప్రాంతంలో అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ పాటు మహా దివ్య పడి పూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అరుణ్ గురు స్వామి నేతృత్వంలో అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో 18 మెట్ల తో కూడిన పడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయప్రాంగణం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. అయ్యప్ప స్వాముల శరణుఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. అదేవిధంగా మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో నరేష్‌స్వామి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురుస్వామి రామచంద్రచారి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో స్వామి వారి అభిషేకాలు చేయడంతో పాటు 18 మెట్లపై కర్పూరాలను వెలిగించి ప్రత్యేక పూజలను చేశారు.



చిన్నశంకరంపేట: జంగరాయి గంగాదేవి ఆలయం వద్ద హోమం నిర్వహిస్తున్న దంపతులు